నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఆగస్టు 03, 2024 | www.navatelangana.com

ప్రజా సమస్యలపై దూరదృష్టి ఉన్న పత్రిక నవతెలంగాణ

- ఆర్క మోతీరాం, తహసీల్దార్

నవతెలంగాణ-లోకేశ్వరం



ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రలోభాలకు లొంగకుండా, దూర దృష్టితో ఆలోచించి ప్రజలను చైతన్యం చేయడంలో నవతెలంగాణ పత్రిక పాత్ర అమోఘమైంది. సామాజిక న్యాయంతో అందరికీ అన్ని రకాల హక్కులు అందాలంటూ తనదైన శైలిలో వార్తా కథనాలు అందించే నవతెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవం శుభసందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు హార్దిక శుభాకాంక్షలు.

కోర్టు సమస్యలను ఉట్నూర్ కోర్టుకు మార్చాలి

సిరికొండ : మండలానికి సంబంధించిన కోర్టు సమస్యలను బోథ్ సివిల్ కోర్టు నుండి ఉట్నూరు సివిల్ కోర్టుకు మార్చాలని రిమ్మ సార్మేడి తొడసం అమృత్‌రావు అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని పలు ఆదివాసీ గ్రామాల కోర్టు సమస్యలు ఇంతకుముందు ఉట్నూరు సివిల్ కోర్టులో ఉండేవని, వాటిని బోథ్ సివిల్ కోర్టుకు తరలించారని తెలిపారు. దీంతో దూరబారం పెరగడంతో పాటు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందికరంగా ఉందని అన్నారు. అధికారులు స్పందించి మండల కోర్టు సమస్యలను ఉట్నూరు కోర్టుకు మార్చాలని కోరారు. ఆదివాసీ గ్రామాల ప్రజలంతా కలిసి తీర్మానం చేశామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్, పెందూర్ అనిల్ కుమార్, భగవంత్‌రావు, గుణవంత్‌రావ్, బారిక్‌రావు, యాదవ్‌రావ్, నగేష్ పాల్గొన్నారు.



స్పెషల్ ఆఫీసర్ సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని వివిధ గ్రామాలలో మండల స్పెషల్ ఆఫీసర్ మడావి గంగారాం శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా దేవాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదివాసీ రాంపూర్ హాబిటేషన్‌లో ఫ్రైడే-డ్రైడేలో పాల్గొన్నారు. దేవాపూర్‌లోని వైద్య శిబిరాన్ని సందర్శించి వర్షాలు కురుస్తున్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు, విరేచనాలు వస్తే వెంటనే గూడెంలోని ఆశా వర్కర్, ఏఎన్ఎంను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. దేవాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి ఇప్పటికే నిర్ణీత గడువు పూర్తి అయినందున వెంటనే బ్యాలెన్స్ పనులు పూర్తి చేయాలని గ్రామైఖ్య సంఘాలను ఆదేశించారు. విద్యార్థులతో మమేకమై వారితో పాఠ్యపుస్తకాలు చదివించి బ్లాక్ బోర్డ్‌లో ఉన్న అక్షరాలను చెప్పించి సంతృప్తి వ్యక్తం చేశారు. దేవాపూర్ గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సందర్శించి బ్యాంక్ పరిధిలో రుణమాఫీపై ఆరా తీశారు. మాఫీకాని రైతులు వ్యవసాయాధికారి ఆఫీసుకు వెళ్లి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల రాంపూర్ హాబిటేషన్‌లో బండారి రాజశేఖర్ ఫర్టిలైజర్‌కు వెళ్లి ఎరువుల స్టాక్, స్టాక్ రిజిస్టర్స్, విక్రయాల రిజిస్టర్స్ తనిఖీ చేశారు. రైతులకు సేద్యానికి కావలసిన అన్ని రకాల ఎరువులు ప్రభుత్వ నిబంధనల మేరకు అందుబాటులో ఉంచాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని డీలర్‌తో పేర్కొనానరు. స్పెషల్ ఆఫీసర్ వెంట డీపీఓ, ఎంపీవో సఫ్దర్ అలీ, మండల వ్యవసాయాధికారి వందన , పంచాయతీ సెక్రెటరీ ఎం.కవిత, పంచాయతీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి

నవతెలంగాణ-నస్పూర్



కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సీసీసీ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో అధికారంలో వస్తే స్థానిక సంస్థల రిజర్వేషన్ 42 శాతం పెంచి వాటిని ఎబిసిడిలుగా వర్గీకరిస్తామని, ఐదేళ్లలో బీసీల సంక్షేమానికి రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడు నెలలవుతున్నా హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఈ అంశాన్ని బీసీ సమాజం ముందు ఎండగడతామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ నాయకులు అక్కల రమేష్, మదరబోయిన రాజన్న యాదవ్, శ్రీపతి రాములు, అంకం సతీష్, శాకాపురి భీమ్‌సేన్ పాల్గొన్నారు.


మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-తాంసి

పెండింగ్ బిల్లులను విడుదలకు అసెంబ్లీ ముట్టడిస్తామని తాజా మాజీ సర్పంచులు పిలుపు నివ్వడంతో వారిని శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఎస్సై శివరాం 13 మంది సర్పంచులను ఉదయం ఏడు గంటలకే అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా తమ అధీనంలోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకొని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షులు సదానందం మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమపై నమ్మకంతో సర్పంచులుగా ఎన్నుకున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి అప్పు చేసి ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. చేసిన పనులకు ఇంత వరకు బిల్లు రాకపోవడంతో అప్పులు తీర్చలేక, బిల్లులు రాక దీనస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకన్న, కేశవరెడ్డి, కృష్ణ, అశోక్, నర్సింగ్, గజానన్, యశ్వంత్, సంభాజీ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీ 14వ వార్డులో శిశు సంక్షేమ, స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింత సువర్ణ అశోక్ కుమార్ పాల్గొని కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు. తల్లి పాలు సంపూర్ణ ఆహారం అని పేర్కొన్నారు. వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తి కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా గర్భిణులకు, బాలింతలకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.శంకరమ్మ, ఎస్.శంకరమ్మ, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛదనం..పచ్చదనం..!

- పల్లె, పట్టణాల శుభ్రతపై సర్కారు ప్రత్యేక దృష్టి
- ఈ నెల 5 నుంచి 9వరకు వివిధ కార్యక్రమాలు
- ప్రజల భాగస్వామ్యంతో నిర్వహణకు సన్నాహాలు
- ప్రత్యేక నిధులు కేటాయించున్న రాష్ట్ర ప్రభుత్వం

వర్షాల కారణంగా అస్తవ్యస్తంగా మారిన పల్లె, పట్టణాలను పరిశుభ్రత వైపు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది. పారిశుధ్య లోపంతో ప్రజారోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని నివారించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి పల్లె, పట్టణాల్లో స్వచ్ఛదనం..పచ్చదనం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు చేపట్టే ఈ కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ వెల్లడించింది. తొలి రోజున గ్రామ, వార్డుల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి వీటి ఆధ్వర్యంలో రోజువారీగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పల్లె, పట్టణాల శుభ్రతతో పాటు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీటిని ఉన్నతాధికారులతో పాటు ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కూడా విడుదల చేయనున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పల్లె, పట్టణాల పరిశుభ్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈ నెల 5వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పల్లె, పట్టణాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. రోజువారీగా చేపట్టే కార్యక్రమాల వివరాలకు తాజా మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో వర్షాల కారణంగా అస్తవ్యస్తంగా మారిన పల్లె, పట్టణాలను పరిశుభ్రంగా మార్చాలని సంకల్పించింది. గత ప్రభుత్వం పల్లె ప్రగతి, హరితహారం కింద ప్రతి ఏటా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టింది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల నియామకంతో పాటు ట్రాక్టర్లను సమకూర్చింది. డంపింగ్‌యార్డులు నిర్మించి ఇంటింటి చెత్తసేకరణ చేపట్టింది. గతంలో మాదిరిగానే తాజా ప్రభుత్వం సైతం స్వచ్ఛదనం-పచ్చదనం పేరిట కార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో వివిధ రకాల మౌళిక వసతులు కొంత మేరకు అందుబాటులో ఉండటంతో వాటి ద్వారా మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించాలని భావిస్తోంది. ప్రస్తుతం వర్షాలు కురవడం..పల్లెలన్ని దుర్గంధం వెదజల్లడంతో వివిధ వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో జ్వరాల తీవ్రత అధికంగా కనిపిస్తోంది. వీటిని నివారించడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తాజాగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.



ఐదు రోజుల పాటు నిర్వహణ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1512 గ్రామ పంచాయతీలు ఉండగా 11మున్సిపాలిటీలు ఉన్నాయి. పల్లె, పట్టణాల్లో ఐదు రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. పల్లె, పట్టణాల్లో రోజువారీగా శుభ్రత కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా స్వచ్ఛత పట్ల గ్రామీణులు, పట్టణవాసుల్లో అవగాహన కల్పించడం.. వారిలో చైతన్యం నింపడం వంటివి చేపట్టనున్నారు. తొలిరోజున నాయకులు, అధికారులు, యువతతో కమిటీలు ఏర్పాటుచేసి చేపట్టాల్సిన పనులపై నివేదిక రూపొందించనున్నారు. వీధులు, ప్రజా ప్రదేశాలు, పాఠశాలలను శుభ్రం చేయడం, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించడం, శ్రమదానం నిర్వహించడం, వర్షపునీటి సంరక్షణ, ప్రతిరోజూ క్లోరినేషన్ చేయడం, చెరువులను పునరుద్ధరించడం, నీటినిల్వ లేకుండా బయటకు పంపించడం, డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలపై అవగాహన కల్పించడం, పచ్చదనంలో భాగంగా వనమహోత్సవం నిర్వహించడం, వివిధ ప్రదేశాల్లో మొక్కలు నాటడం వంటివి చేపట్టనున్నారు. సార్వజనిక స్థలాలను గుర్తించడం వంటివి చేపడుతారు. పంచాయతీ స్థాయిలో ప్రత్యేక అధికారితో పాటు పంచాయతీ కార్యదర్శి, ఆశా,అంగన్‌వాడీ టీచర్ తదితరులతో బృందాలు ఏర్పాటు చేయనున్నారు. మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులకు సంబంధించిన నివేదికలు అందజేయనున్నారు.

మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలు చేపడతాం : శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. జిల్లాలో ఐదు రోజుల పాటు చేపట్టే ఈ కార్యక్రమంతో అందరి భాగస్వామ్యంతో పల్లెలను స్వచ్ఛతగా మారుస్తాం. ప్రభుత్వం ఇందుకు సంబంధించి నిధులు కూడా విడుదల చేయనున్నట్లు తెలిసింది.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, ఎసీడీపీవో, సీడీపీఓలు, వైద్య శాఖ అధికారులతో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ముందుగా తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతరాయాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యతను చాటుదాం అనే థీమ్‌తో ప్రతి అంగన్వాడి సెంటర్ల పరిధిలో, సబ్ సెంటర్స్, పీహెచ్‌సీ, సీహెచ్‌సి, ఏరియా, ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, డీఆర్డీఏ, మెప్మా, ఆరోగ్య శాఖ సిబ్బంది, పత్రిక, డిటల్ మీడియా, సోషల్ మీడియా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ప్రసవాలు వందశాతం ఆసుపత్రులలో జరిగేలా చూడాలన్నారు. ముర్రుపాలు పట్టించే విధానం చాలా తక్కువ శాతం ఉందని, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలను, కిశోర బాలికలు, వృద్ధులను, కుటుంబ సభ్యులను, పీఆఐ మెంబర్స్, వార్డ్ సభ్యులు అందరు పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. దీనిలో భాగంగా 7 నెలల నుండి 2 సంవత్సరాల పిల్లలకు బాలామృతం, బాలామృతం ప్లస్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ ఏడు రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియా, జిల్లా శిశు సంక్షేమాధికారి సబిత, ఏసీడీపీఓ మిల్కా, సీడీపీఓలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం- పచ్చదనంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ఈ నెల 5 నుండి 9 వరకు కొనసాగనున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో చేపట్టవలసిన కార్యక్రమాలపై మండల ప్రత్యేకాధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రోజువారీగా ప్రణాళికలను రూపొందించుకొని వివిధ కార్యకలాపాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం వంటి విషయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విస్తృత స్థాయిలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిరంతరం పారిశుధ్య పనులను కొనసాగించాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చాలని, వర్షాలు కురుస్తున్నందున నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. దోమల నివారణ రసాయనాలను పిచికారీ చేయాలని తెలిపారు. దోమలు పెరగకుండా నియంత్రించి, కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన పెంచేలా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి ఖాళీ చేయించాలన్నారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున, వాటికి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పి సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, చీఫ్ ప్లానింగ్ అధికారి బాబురావ్, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా శ్వేత నియామకం

జన్నారం : మండల పశువైద్యాధికారిగా డాక్టర్ శ్వేత నియమితులయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశు వైద్య కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండల పశువైద్యాధికారిగా 8 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పనిచేసిన డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ బదిలీ కావడంతో కాగజ్‌నగర్ నుండి శ్వేత ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పశు సంపద పెంచడానికి, పాడి రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.



న్యాయం చేయాలని రోడ్డుపై బైటాయింపు



నవతెలంగాణ-నేరడిగొండ

కుప్టి హైడల్ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు, గృహాలు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని నిర్వాసితులు శుక్రవారం రోడ్డుపై బైటాయించారు. రైతులు అధికారుల కాళ్లు పట్టుకొని బతిమాలాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి సరిహద్దులు గుర్తిస్తున్న క్రమంలో నిర్వాసితులు అడ్డుకున్నారు. నిర్మాణంలో భాగంగా కుప్టి, కుమారి, గాజిలీ, గాంధారి గ్రామాలు ముంపుకు గురి కానున్నాయి. సుమారు తొమ్మిది వందల ఇండ్లు, దాదాపు రెండు వేల ఎకరాల సాగు భూమి ముంపుకు గురవుతుందని నిర్వాసితులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిన్న నీటి పారుదల శాఖ డీఈ భీంరావ్, ఇన్‌చార్జి తహసీల్దార్ మహేష్ మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం సరిహద్దులు ఏర్పాటు అనంతరం జిల్లా ఉన్నతాధికారులు ఇక్కడికి పరిశీలనకు వస్తారన్నారు. సమస్యలు, డిమాండ్లను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. వారి వెంట జేఈ జాదవ్ ప్రకాష్, ఆర్ఐ నాగరావు ఉన్నారు. ఆందోళనలో రైతులు గడ్డం భీంరెడ్డి, మందుల రమేష్, నవీన్ పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.

చెన్నూరు పట్టణంలో కొరవడిన పారిశుధ్యం



నవతెలంగాణ-జైపూర్

చెన్నూరు పట్టణంలో పారిశుధ్యం కొరవడిందని సీపీఐ(ఎం) నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని భేతాలవాడ, మారెమ్మవాడ, లైన్‌గడ్డ, నల్లగొండ పోచమ్మవాడ, కోటబోడ, మసీదు రోడ్డు, ఖాజీపుర, మునిసిపల్ రోడ్డులలో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సమస్యలపై కాలనీవాసులు ఏకరువు పెట్టారు. డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. మిషన్ భగీరథ పైప్ లైన్ ఏర్పాటు కోసం తవ్విన గుంతల్లో మురుగు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోయారు. ఇబ్బందులను పరిష్కరించాలని గత ఎమ్మెల్యేతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యేని కలిసి విన్నవించినా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడమే తప్ప ఆచరణలో పెట్టింది లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఏమాత్రం అభివృద్ధి చెందని చెన్నూరు పట్టణం ప్రస్తుత ప్రభుత్వంలో కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదని నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, నాయకులు కావేరి రవి, రాతిపల్లి నగేష్, బండారి శ్రీనివాస్, ఉమారాణి, రమాదేవి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు



నవతెలంగాణ-మంచిర్యాల

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ పట్టణంలో మాదిగ సామాజిక వర్గాలకు చెందిన అన్ని పార్టీల నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మందకృష్ణ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మంది మాదిగల త్యాగాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ జరగబోతోందన్నారు. ఏండ్లుగా ఎదురుచూస్తున్న కల నిజం కాబోతందని, దీనికి కారణమైన మందకృష్ణ పోరాటానికి మాదిగ జాతి తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శరత్, చెన్నూరి సమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు చిప్పకుర్తి జగన్, మల్లేష్, రమేష్, రాజు, ఐలయ్య, మల్లేష్, నక్క తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మావల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..జైనథ్ మండల కేంద్రానికి చెందిన పుంద్రు సంతోష్(30) రిమ్స్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం పట్టణంలోని ఇమామ్ అలీ బిల్డింగ్ ఎదుట ప్రధాన రహదారిపై సాయంత్రం ఇంటివైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. దీంతో సంతోష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో పాటు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. హుటాహుటిన కుటుంబీకులు వెంటనే రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున సంతోష్ మృతి చెందాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పొలం బాటలో విద్యుత్ శాఖ అధికారులు

నవతెలంగాణ-కడెం



ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చేపట్టిన బృహత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్‌శాఖ అధికారులు సిబ్బంది కలిసి పొలం బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈ సుమన్ కుమార్ మాట్లాడారు. వ్యవసాయ మోటార్ల వద్ద కెపాసిటర్‌ల వినియోగం వాటి ఆవశ్యకత, ఆటోమేటిక్ స్టార్టర్‌లో తీసివేత, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన మాజీ సర్పంచులు

నవతెలంగాణ-ముధోల్



సర్పంచ్ పదవీకాలం ముగిసి నెలలు గడిచినా గతంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవటంతో తెలంగాణ సర్పంచ్‌ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో నిరసన తెలుపుటానికి ముధోల్, బాసర మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ప్రత్యేక వాహనంలో వెళ్లారు. తాము చేసిన అభివృద్ధి పనులకు నేటికీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవటంతో అప్పులు పేరిగిపోయి ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. తమ బిల్లులు మంజూరు చేసేంతవరకు వరకు శాంతియుత నిరసన తెలియజేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ బయలుదేరిన వారిలో మాజీ సర్పంచ్‌లు, రాంచందర్, సాయినాథ్, శివాజీ, దిగంబర్, నాయకులు రవికిరణ్‌గౌడ్, మైసాజీ, కిష్టయ్య, దత్త్రాత్రి, గౌతం, అమృత్ పటేల్ పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ రాంబాబు వైద్య సిబ్బందితో కలిసి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో 63 మంది బాలికలకు రక్త పరీక్షలు చేశారు. జ్వరం, జలుబు, దగ్గు, ఉన్న వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది ఈశ్వర్, జంగుబాయి, సరస్వతి, ఉజ్వలా, సుభాష్ ఉన్నారు.

పశువైద్యాధికారులకు సన్మానం



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని గత కొన్నేండ్లుగా పశువైద్యాధికారులు పని చేసి, సాధారణ బదిలీల్లో భాగంగా వెళ్లినవారికి, ఖాళీ అయిన వారిస్థానంలో వచ్చిన వారికి మండల కేంద్రంలోని పశువైద్యకార్యాలయంలో శాలువా కప్పి సన్మానించారు. నేరడిగొండ ప్రభుత్వ పశువైద్యశాల అధికారిగా డా.జీవన్ రాథోడ్, వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేసిన అనితా, నిర్మల్ జిల్లాకు, బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా నరేందర్, నిర్మల్ నుంచి బదిలీపై వచ్చారు. అదేవిధంగా తర్నంలో డిప్యూటేషన్‌పై పనిచేసిన విజయలక్ష్మి నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వెంకన్న వీఎల్‌ఓ, నిర్మల్ జిల్లా నుంచి తర్నం పశు వైద్యశాలకు బదిలీపై వచ్చారు. మండల పశు వైద్యాధికారిగా పనిచేసిన డా.సుశీల్ వాంకిడి పశు వైద్య శాల బాధ్యతలను స్వీకరించారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ముధోల్

నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ విన్నపం మేరకు నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌కు రూ.40 లక్షలతో, పాటు ఆయా గ్రామాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.1.25కోట్లుతో పాటు స్పెషల్ ఫండ్ కింద వివిధ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు రూ.24 లక్షల నిధులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఇటీవల విన్నవించారు. దీంతో మంత్రి నిధుల మంజూరును పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. జారీచేసిన లెటర్‌ను నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు వారు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధ్యాపకులకు వీడ్కోలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంద్రవెల్లిలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై ప్రభుత్వ జూనియర్ కళాశాల గుడిహత్నూర్, ఉట్నూర్, హాసన్‌పర్తికి వెళ్లిన ప్రిన్సిపల్ ధన్‌రాజ్, లెక్చరర్ రాథోడ్ శ్రావణ్, శ్రీనివాస్, బోధనేతర సిబ్బంది మల్లేశం, శంకర్, సుగుణ బాయిలకు కళాశాల సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన లెక్చరర్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సీనియర్ అధ్యాపకులు కురపాటి వెంకటేశ్, మధుకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమని అన్నారు. అధ్యాపకులు తమ విధి నిర్వహణలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను భోధిస్తూ, అంకిత భావంతో విధులు నిర్వహించారని, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు భోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలోని ఎంపీయూపీఎస్, ఉన్నత పాఠశాలల్లో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకోసం ఫౌండేషన్ ముందుకు వచ్చి పుస్తకాలను పంపిణీ చేయడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మరిన్నీ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు అండగా నిలవాలని పాఠశాల చైర్మెన్ సుగుణ, మాజీ చైర్మెన్ మహ్మద్ రఫీక్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, వసుధ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం

కార్యక్రమాలు విజయవంతం చేయాలి

• కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి ఆగస్టు 9 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రత, పచ్చదనాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించిందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి స్వచ్ఛదనం, పచ్చదనంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతంగా అమలవ్వడానికి గ్రామాలు, పట్టణ ప్రాంతాల శుభ్రత ప్రతిరోజు చేపట్టి, ఇంటి స్థాయిలో కమ్యూనిటీ స్థాయిలో మొక్కలు నాటాలని సూచించారు. ఆగస్టు 5న స్వచ్ఛదనం, పచ్చదనం ప్రారంభమవుతుందని తెలిపారు. స్థానిక నాయకులు, ఎస్‌హెచ్‌జీలు, యువకులు, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం, ర్యాలీ నిర్వహించాలన్నారు. ఇంటి స్థాయిలో వేరు చేయబడిన చెత్తను సేకరించి, కంపోస్టు ఉత్పత్తిని సూచనల ప్రకారం చేయాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, మొక్కల నాటడం, వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంపై స్పీచ్, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని అన్నారు. వీధులు, ప్రజా ప్రదేశాలను శుభ్రపరచడం లాంటివి చేయలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలను అవగాహన పెంచడానికి గోడ పూసలు ఏర్పాటు చేయడం, ప్రజల ద్వారా శ్రమదానం నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పైభాగాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోతే, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 6న వర్షపు నీటి సంరక్షణ గురించి అవగాహన చేపట్టాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాళవియ, ఆర్డీఓ వినోద్ కుమార్ ఆదిలాబాద్, ఉట్నూర్ జీవాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఇన్‌ఛార్జి కలందిని, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణులకు తపాల సేవలు ఎంతో మేలు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే పోస్టల్ శాఖ ద్వారా అందించే సేవలు గ్రామీణులకు ఎంతో మేలు చేస్తుందని (ఐపీఓ) తపాలా అధికారి సందీప్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో గ్రామీణ ప్రజలకు పోస్టల్ శాఖ ద్వారా అందించే వివిధ సేవలు, పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1954 నుంచి మనదేశంలో పోస్టల్ శాఖ ప్రతీ పల్లెలో విస్తరించి ఉందన్నారు. పోస్టల్ శాఖ అంటే ఉత్తరాల బట్వాడగానే అందరికి సూపరిచితం, కానీ ప్రస్తుతం పోస్టల్‌శాఖ ఉత్తరాల బట్వాడాతో పాటు నరేంద్ర మోడీ ఆడ పిల్లలు కోసం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం, గ్రామీణ జనం కోసం గ్రామీణ తపాల బీమా, ప్రమాదం జరిగిన వారి కోసం ప్రమాద బీమా పథకాలు పట్టణవాసుల కోసం, చదువుకున్న వారి కోసం బీమా పాలసీలు అయిన పీఎల్ఐ, ఇంకా మరెన్నో పథకాలున్నాయని వివరించారు. అలాగే గ్రామీణ ప్రజలకు చిన్న మొత్తాల పొదుపు, (ఐపీపీబీ) ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ద్వారా తక్కువ ఖర్చులతో వినియోగదారులకు ఇంటి వరకు సమయం, పని వృధా కాకుండా సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కేవలం రూ.200లతోనే సేవింగ్ అకౌంట్ చేసుకోవడం, ఆధార్ లింక్‌లతో ఉపాధి హామీ డబ్బులు పొందడం, ఇంకా ఇతర బ్యాంక్ లావాదేవీలు లాంటి సౌకర్యాలు పోస్టల్ శాఖ ద్వారా పొందవచ్చని తెలిపారు. అనంతరం ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పోస్టల్ శాఖ తమకు సహకారం అందిస్తే ఉపాధి కూలీలకు ఇబ్బంది లేకుండా చూస్తే తమ వంతుగా పోస్టల్ శాఖ ద్వారా గ్రామాల పరిధిలో బీమా పాలసీలు, పొదుపు పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలు వినియోగించుకొనేటట్టు తాము కూడా చేయూతను అందించనున్నట్లు తెలిపారు. పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ సాగర్ మాట్లాడుతూ రూ.520 జనరల్ ఇన్సూరెన్సు ద్వారా రూ.10 లక్షల ప్రమాద బీమాను, రూ.755లతో రూ.15 లక్షలు ప్రమాదం జరిగిన వారికి అందించడం జరుతుందని అన్నారు. పాము కాటు, బాత్ రూమ్ లో జారీపడుట, అనుకోని ప్రమాదం ఏక్సిడెంటల్ సంఘటనలు ఉదారణకు చేను పనులు చేస్తున్నప్పుడు జరిగే ప్రమాదాలు వివరించారు. గ్రామీణ ప్రజలు ప్రతీ ఒక్కరూ తపాలాశాఖ అందిస్తున్న పథకంలలో చేరి లబ్ది పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెలర్స్ మహమ్మద్ మునీర్, పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ సాగర్, మాజీ ఎంపీటీసీ పాండురంగ్, ఏపీఓ శ్రీనివాస్, పోస్టల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్, వివిధ గ్రామాల బీపీఎంలు, ఏబీపీఎంలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎస్పై

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన పేద దంపతులు మిర్యాల సునందా లక్ష్మణ్ కుటుంబానికి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సక్రియా నాయక్ సిబ్బందితో కలిసి రూ.వెయ్యితో పాటు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం శాలువాతో దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. పేద దంపతులకు ఆర్థిక సాయం చేసిన ఎస్సైని పలువురు అభినందించారు.

పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లాల్ టెక్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 14న తక్షణ ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఇంజనీరింగ్ వృత్తి విద్యా కోర్సులైన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాలకు లాల్ టెక్డిలోని పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించాలని, 8096907526 నెంబరుకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

కళాకారులకు వేతనాలు పెంచడం హర్షణీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారులకు వేతనాలు పెంచడం హర్షణీయమని కళాకారులు గట్టు వెంకట్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తు సీఎంతో పాటు డిప్యూటి సీఎం, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుల చిత్రపటాలకు శుక్రవారం అమరవీరు స్థూపం వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కళాకారుడు వెంకట్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారులకు రూ.24వేల 514 వేతనం ఇచ్చిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి 30 శాతం పీఆర్సీ పెంచడంతో రూ.31,868 వేతనం వస్తుందని ఇది హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి పాటల రూపంలో అవగాహన కల్పిస్తున్నా తమను గుర్తించడం సంతోషకరమన్నారు. అలాగే రెగ్యూలర్ చేయడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గుంజాల రమేష్, చాకటి రవి, రాజలింగు, శంకర్, గోవింద్, మురళీ, నర్సమ్మ, ధృపద బాయి, శ్రీలత ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శిగా సేవలు మరవలేనివి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని పిప్పల్‌ధరి గ్రామపంచాయతీ కార్యదర్శిగా మునేశ్వర్ చంద్రశేఖర్ అందించిన సేవలు మరవలేనివని పిప్పల్‌ధరి మండల సాధన కమిటీ అధ్యక్షులు తెలంగ్ బాపురావు అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు, సాధన కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్యదర్శిగా 18 సంవత్సరాల పాటు గ్రామప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించారని అన్నారు. ఒక ఉద్యోగిగా బదిలీలు సహజమని అన్నారు. అదే విధంగా బేల మండలం కొబ్బాయి గ్రామం నుంచి పిప్పల్‌ధరికి బదిలీపై వచ్చిన నూతన పంచాయతీ కార్యదర్శి ఆక్కల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోరాక్, వైభావ్, శ్రీనివాస్, తాక్‌సాండే సుభాష్, ఆనందర్‌రావు, రాంకిషన్, ముక్కేర అశోక్, దత్తు, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



విద్యార్థులు పట్టుదలతో చదవాలని హైమన్ డార్ఫ్-బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షులు దుర్వ సంతోష్ అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హైమన్ డార్ఫ్-బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయం ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్, పెన్సిల్స్‌లను ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. అదే విధంగా వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుకు ఇరువైపులా వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు తనవంతుగా గోడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైమన్ డార్ఫ్- బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని, కష్టపడి చదవాలని పేర్కొన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించడానికి చదువు ఒక వజ్రయుధం లాంటిందని తెలిపారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెస్రం రవీంద్ర, అర్జున్, పూసం నాందేవ్, అన్నపూర్ణ, యువకులు రంగుల రాజు, ఆదిమూలం నరేష్, గారులే కిరణ్, రాజు పాల్గొన్నారు.

సీఎం ముఖాముఖి కార్యక్రమానికి బయలుదేరిన ఉపాధ్యాయులు



నవతెలంగాణ-నిర్మల్

ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి శుక్రవారం తెల్లవారుజామున 11 బస్సుల్లో మొత్తం 465 మంది ఉపాధ్యాయులు హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ బస్సులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు బస్సులవారీగా హాజరైన ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయులంతా వారికి కేటాయించిన బస్సుల్లోనే వెళ్లాలని, తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. బస్సులవారీగా ప్రయాణ వివరాలను నిర్దేశించిన యాప్‌లో నమోదు చేయాలని, ప్రయాణ సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కాగా నిర్మల్ పట్టణం నుంచి ఏడు బస్సులు, బైంసా, ముధోల్ నుంచి మూడు బస్సులు, ఖానాపూర్ నుంచి ఒక బస్సులలో ఉపాధ్యాయులు ముఖాముఖి కార్యక్రమానికి బయలుదేరారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ గోవింద్, అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్లు, ఎంపీడీఓలు, లైజనింగ్ అధికారులు, ఉపాధ్యాయులు, భద్రతా పోలీస్ సిబ్బంది, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం మండల అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంద్రవెల్లిలో స్థానిక ఎంపీడీఓ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9 వరకు పచ్చదనం పరిశుభ్రత బృహత్తర కార్యక్రమం చేపటుతోందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. అధికారులకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం పంచాయతీలు, గ్రామాల వారీగా ప్రజలతో మమేకమై మొక్కలు నాటడం, గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం, వైద్య శిబిరం ఏర్పాటు చేయటం, డెంగ్యూ, మలేరియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవీసీలో ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్, డీటీ రమేష్ నాయక్, మేజర్ జీపీ ఈఓ సంజీవ్‌రావ్, అధికారులు పాల్గొన్నారు.

5న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల చాందా(టి)లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు వేరువేరుగా జావెలిన్ త్రో, 100, 400 మీటర్ల పరుగు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7న హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు బోనాఫైడ్, వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు చాందా(టి) పాఠశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండలాధ్యక్షుడు ఆడ శ్రీరామ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురంభీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న ప్రతి ఆదివాసీ గూడెంలో, మండల కేంద్రాలలో, జిల్లా కేంద్రాలలో, ఒక పండగ వాతావరణలో నిర్వహించాలన్నారు. 9తెగల ఆదివాసులు సమన్వయంతో సంఘాలకు, పార్టీలకు అతీతంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్రపతి భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఆదివాసీ గ్రామాల నుంచి ఆదివాసులు వచ్చి ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట ఆదివాసీ నాయకులు పెందోర్ విఠల్, మెస్రం మానిక్ రావ్, కుర్సెంగ నగేష్, పూసం ఇసు, సుర్పం నాగోరావ్, జుగ్నాక భీంరావ్, కనక హన్మంతు, ఆత్రం రమేష్, మోతీరాం, చిత్రు, హన్మంత్‌రావ్, భీంరావ్, సంతోష్, రమేష్, భీంరావ్, యశ్వంత్ రావ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

నవతెలంగాణ-తలమడుగు

మండల ప్రజా పరిషత్తు కార్యాలయం గత కొన్నేండ్లుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న అధికారులను శుక్రవారం మండల కేంద్రంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మిరాజేశ్వర్ మాట్లాడారు. మండల సూపర్‌టెండెంట్‌గా మండల ప్రజలకు సేవలు అందిస్తూ బదిలీపై వెళ్తున్న సూపరిండెంట్ జమీల్‌ఖాన్ అదేవిధంగా అటెండర్‌గా పని చేస్తున్న ఊశన్న, నర్సింలు మండల ప్రజలకు సేవలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారు చేసిన సేవలను మార్చిపోలేనివని కొనియాడారు. వారిని శాలువాతో సన్మానించి, వీడ్కోలు పలుకుతూ కొత్తగా బదిలీపై వచ్చిన అధికారులకు స్వాగతం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఎంపీడీఓ శేఖర్, వెటర్నరీ డాక్టర్ దూద్‌రాం, ఎంపీఓ సుధీర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ నగేష్, పెందురు మాధవ్, పోశెట్టి వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కవికి సాహితీ సేవ అవార్డు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రానికి చెందిన కవి రాధాకృష్ణ చారి సాహితి సేవ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ఎలివేట్స్ కల్చరల్ ఎలైట్‌లో ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కవి సమ్మేళనం సిని విభావరి అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా ప్రముఖ సినీ, టివి గేయ రచయితలు రామ్ మనిక్ తేజ, రాజేంద్రరాజు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కవిగా చేసిన సేవలకు గాను అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. అవార్డు గ్రహీత రాధాకృష్ణ చారి మాట్లాడుతూ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సినీ నటుడు మా లైఫ్ సభ్యులు అర్జున రాజు, ఇందిర ఫౌండేషన్ అధ్యక్షురాలు ఇందిర, అధ్యక్షులు ఆలూరి విల్సన్, సినీ టివి ప్రముఖులు, కవులు రచయితలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు నిర్వహించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న పలు పాఠశాలల్లో సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అసోషియేషన్ రాష్ట్ర నాయకులు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి నిర్వహించిన జూమ్ సమావేశంలో స్థానిక అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు. వయోధికుల పోషణ, రక్షణ, వారికి జరిగే అనాదరణ నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ జూమ్ మీటింగ్‌లో చర్చించారు. ఈ సమావేశంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు రమణయ్య, కోటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు, చిలుక లక్ష్మినారాయణ, సీహెచ్ రామయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను ఆదుకోవాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బకాయి పడ్డ వేతనాలను చెల్లించాలని కోరుతూ వారం రోజులుగా కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, వారిని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం ఇచ్చారు. నాలుగు నెలలుగా జీతాలు లేక వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రూ. 2 కోట్ల పీఎఫ్, రూ. 36 లక్షల ఈఎస్ఐ డబ్బులను వారివారి ఖాతాలలో జమ చేయకపోవడం కారణంగా కార్మికులు అటు వైద్యపరంగా కూడా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, కో కన్వీనర్ మొయిన్, నాయకులు అంబాల ఓదేలు, ఎంఎ సలీం, నక్క మనోహర్, ఆకుల రాజ్‌కుమార్, గోగర్ల కన్నయ్య, కాసిపాక రాజు, దాసరి నరేందర్ పాల్గొన్నారు.

పెద్దవాగు వంతెనకు మరమ్మత్తులు చేయాలి

కాగజ్‌నగర్ నుండి క్రాస్‌రోడ్డుకు వెళ్లే దారిలో ఉన్న పెద్దవాగు వంతెనకు వెంటనే మరమ్మత్తులు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం దెబ్బతిన్న ఆ వంతెనను వారు పరిశీలించారు. ఎస్పీఎంకు చెందిన భారీ వాహనాలతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, యూపీ తదితర రాష్ట్రాల నుండి వాహనాలు ఇదే మార్గంలో పయనిస్తున్నాయని, దీనితో వంతెన దెబ్బతిని ఏ నిమిషమైనా ప్రమాదం జరిగే స్థాయికి చేరుకుందన్నారు. ఇప్పటికే అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెన కూలి కొన్నేళ్ల పాటు ప్రజారవాణాకు ఇబ్బందులు ఏర్పడ్డాయని, అది పునరావృతం కాకుండా ఈ వంతెనను అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని వారు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

సింగరేణి చైర్మెన్‌ను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి చైర్మెన్ ఎన్.బలరాంని హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బెల్లంపల్లి ఏరియా తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు కలిశారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓపెన్ కాస్టును తొందరగా ప్రారంభించడానికి కృషి చేయాలని కోరారు. బెల్లంపల్లి ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులకు ఇదే ఏరియాలో పని కల్పించాలంటే నూతన బొగ్గు గనుల ఏర్పాటు అవసరం ఉందని తెలిపారు. ఇందులో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాస్ రావు,సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, జాయింట్ సెక్రెటరీ చంద్రశేఖర్, ఓరం కిరణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, ఏరియా సెక్రటరీలు మారిన వెంకటేష్, అలవేణి సంపత్ ఉన్నారు.

వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పోలీసు శాఖకు నిర్దేశించిన వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సూచించారు. శుక్రవారం కాగజ్‌నగర్ టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. దీనికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భవిష్యత్తు తరాలకు మంచిని అందించినవారమవుతామన్నారు. డివిజన్‌లోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలోని ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ శంకరయ్య, ఎస్ఐ అంజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు వార్డుల విభజన ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత ఫిబ్రవరి మూడో తేదీన ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువరించినప్పటికీ వార్డుల విభజన కాకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. తాజాగా మున్సిపల్ శాఖ అధికారుల నుండి వార్డు విభజనల చేయమని ఉత్తర్వులు రావడంతో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు ఆధ్వర్యంలో సిబ్బంది వార్డు విభజనలో భాగంగా కాలనీలు తిరుగుతూ వారి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా వార్డుల విభజన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డుల విభజన చేస్తున్నట్లు తెలిపారు. విభజనతో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ రూపురేఖలు వస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ఈ నెల 5 నుండి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి అన్ని మండలాల అన్ని స్థాయిల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలన్నారు. తాజా మాజీ ప్రజా ప్రతినిధులను యువజన, మహిళా సంఘాలతో పాటు ప్రజలను భాగస్వామ్యులను చేయాలన్నారు. ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలపై మండల, గ్రామస్థాయిలలో సమావేశాలు నిర్వహించాలన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు, ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఐదో తేదీ నుండి ప్రారంభమయ్యే కార్యక్రమంలో రోజువారిగా నిర్వహించిన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ ఆర్డీఓలు లోకేశ్వరరావు, కాసబోయిన సురేష్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.

ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధిపై దృష్టి సారించాలి

జిల్లాలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ జిల్లా నుంచి వివిధ రకాల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ వివిధ రకాల ఉత్పత్తుల ఎగుమతులను అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎగుమతి చేయగలిగిన ఉత్పత్తులను గుర్తించాలని, జీఐ ట్యాగ్ కలిగిన డోక్రా కాస్టింగ్ ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చని, తృణధాన్యాలలో జొన్న పంట సాగుకు జిల్లాలోని వాతావరణం అనుకూలమైందని, జొన్నల ద్వారా తయారు చేసిన ఆహార పదార్థాలు, వెదురు ఉత్పత్తులు, ఎర్ర కోట ద్వారా తయారు చేసిన ఉత్పత్తులు, వీటితో పాటు పుట్టగొడుగుల పెంపకం ప్రోత్సహించడం ద్వారా జిల్లా నుండి ఎగుమతి సాధ్యపడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రెడీమేడ్ గవర్నమెంట్ యూనిట్ స్థాపించి ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చని అన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చేందేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆర్. శ్రీనివాసరావు, నాబార్డు డీడీఎంకే వీరభద్రుడు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మదిరె అశోక్ పాల్గొన్నారు.

గిరిజన రైతులు కూరగాయల సాగు చేయాలి

జిల్లాలోని ఆదిమ గిరిజన రైతులు కూరగాయల సాగు ద్వారా మరింత ఆదాయాన్ని పొందాలని, పోషక విలువలు కలిగిన ఆహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం ఐడీటీఏ పీఓ ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆదిమ గిరిజన రైతులకు 12 రకాల కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీ రైతులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో 12 రకాల విత్తనాలను ఉచితంగా అందించడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకొని రైతులు అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు. ఆదిమ గిరిజనులు ఎక్కువగా అటవీ ప్రాంతాలలో నివసిస్తున్నందున సరైన కూరగాయలు, పోషక ఆహారం అందక మహిళలు, గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, సంస్థ అందించిన విత్తనాలు సాగు చేసుకుని నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకుని ఆహారంలో తీసుకుని ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. కొర్రలు, సాములు, రాగులు, జొన్న విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీవీటీసీల ప్రత్యేక అధికారి మనోహర్, ఐటీడీఏ ఉద్యానవన అధికారి సందీప్, గిరిజన అభివృద్ధి శాఖ అధికారులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

మద్యం తాగి ప్రమాదం చేస్తే మర్డర్ కేస్

- ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూలై 1 నుండి వచ్చిన నూతన చట్టాలలో ఉన్న నిబంధనల మేరకు తాగి వాహనం నడిపి ప్రమాదం చేసిన రాంగ్ రూట్‌లో వచ్చి ప్రమాదం చేస్తే మర్డర్ కేసు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా రవాణాశాఖ అధికారి రామచందర్, డిఎస్పీ సదయ్యతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ప్రమాదాల్లో 1,50,000 మంది చనిపోతున్నారని, 4 లక్షల మంది గాయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో 22,000 ప్రమాదాలు నమోదవుతుండగా 7000 మంది చనిపోగా 27 వేల మంది గాయపడుతున్నారని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరంలో వివిధ ప్రమాదాల్లో 80 మంది చనిపోగా, 150 మంది గాయపడ్డారని, ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటికే 40 మంది చనిపోయారని, ప్రతి మూడు ప్రమాదాల్లో ఒకరు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి అధిక వేగం మద్యం తాగి వాహనం నడపడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, హెల్మెట్లు ధరించకపోవడమే కారణాలన్నారు. 50శాతం ప్రమాదాలు ద్విచక్ర వాహనాలతో జరుగుతున్నాయని అన్నారు. నూతన చట్టాల ప్రకారం మద్యం తాగి, రాంగ్ రూట్‌లో వచ్చి యాక్సిడెంట్ చేస్తే మర్డర్ కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటున్నామని, రానున్న రోజుల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏఎస్పీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఆటోలు, పాఠశాల బస్సుల్లో ఎక్కువ లోడ్‌తో ప్రయాణం చేయడం మానుకోవాలన్నారు. హెల్మెట్ ధరించడం పోలీసుల కోసం కాదని వాహనదారుల ప్రాణాల కోసమేనని గుర్తుంచుకోవాలన్నారు. డీటీఓ రామచందర్ మాట్లాడుతూ వాహనాలకు తప్పనిసరిగా అన్ని రకాల పత్రాలు ఉంచుకోవాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఇది ఎంతగానో పనిచేస్తుందని తెలిపారు. పోలీసుల కోరిక మేరకు జిల్లాలో ఆగస్టు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్సుల డ్రైవ్ నిర్వహించి రోజు ఐదు మంది చొప్పున డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అందరితో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా జరుగుతున్న ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను ఎల్ఈడీ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో వాంకిడి, ఆసిఫాబాద్ సీఐలు శ్రీనివాస్, సతీష్, డీసీఆర్బీ సీఐ రమేష్, పోలీసు అధికారులు విద్యార్థులు, వాహనదారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలివ్వాలి



నవతెలంగాణ-రెబ్బెన

ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వీఓఏలు ఏఐటీయూసీలో చేరాగా వారికి కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీలో 20 ఏండ్లుగా వీఏఓలు పని చేస్తున్న కనీస వేతనం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని, కనీస వేతనం 26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీళ్లకు సెర్ప్ నుండి కేవలం రూ.5000 గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. కుటుంబ పోషణ కష్టం అవుతుందన్నారు. వీరిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి వీఓఏకు రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, స్త్రీ నిధి ఇన్సెంటివ్ పెంచి ఇవ్వాలని, అర్హులైన వారిని సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం వీఓఏల ఉద్యోగుల సంఘం(ఏఐటీయూసీ) మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఏ.లింగన్న, అధ్యక్షుడుగా గజెల్లి భీమేష్, ఉపాధ్యక్షుడుగా తిరుపతి, నసీమ, ప్రధాన కార్యదర్శిగా మైలారపు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రవి, కృష్ణ, కోశాధికారిగా చల్లూరి రజితతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాసతరంగిణి, ట్రస్మా సహకారంతో స్థానిక ఫాతిమా కాన్వెంట్‌లో మాతృభూమికి కృతజ్ఞత, సీమా సంరక్షణ దళాలకు, స్వాతంత్ర్య సమరయోధులకు కృతజ్ఞత అనే అంశాలపై జిల్లా స్థాయి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని పలు పాఠశాలల నుండి సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా సమాజంలోని సమకాలిక అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. పాఠశాలల్లో ఉన్న గ్రంథాలయ పుస్తకాలను ప్రతీ రోజు చదవాలన్నారు. వ్యాసరచన అంశం నుండి ఇంగ్లీషు, తెలుగు మీడియాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, డ్రాయింగ్ అంశం నుండి ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా రవిశంకర్, సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు దేవభూషణం, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



అరెస్టుతో ఉద్యమాన్ని ఆపలేరు



నవతెలంగాణ-కెరమెరి

హక్కుల కోసం ఉద్యమించే తమను అరెస్టులతో ఆపాలేరని మాజీ సర్పంచులు అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని సచివాలయం ఎదుట నిరసన దీక్షకు మాజీ సర్పంచ్లు ఇచ్చిన పిలుపు మేరకు పోలీసులు మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేశారు. సాంగ్వి, ఝరి మాజీ సర్పంచ్లు తొడసం జగన్నాథ్ రావు, కుంరం నాజేశ్వర్‌లను శుక్రవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్టేషన్‌కు తరలించారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని లోడ్పల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బూరషా రామయ్య నిన్న రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్ జాజీమొగ్గ శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి ఆర్థిక సాయం రూ.4000 అందజేశారు. భవిష్యత్తులో తన వంతుగా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఖైర్‌గూడ ఓసీపీ సందర్శన

నవతెలంగాణ-రెబ్బెన

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ అండ్ మినిమం వేజ్ బోర్డ్ కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు బాయి బాటలో భాగంగా బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీని బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్ సందర్శించారు. ఓసీపీలోని పలు సమస్యలను తెలుసుకొని ఖైర్‌గూడ మేనేజర్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఖైర్‌గూడ ఫిట్ సెక్రటరీ భాస్కరాచారి, మాసాడి నారాయణ, మాధవకృష్ణ, సంజీవరెడ్డి, శ్రీకాంత్ సూర్యనారాయణ, కే శ్రీనివాస్, ఎంపీ వెంకటేష్, ఆది శ్రీనివాస్, బోడ తిరుపతి, కే నరేందర్, ఎం వెంకటేష్, శివకుమార్, అంకుష్, అడిగోప్పుల స్వామి, యు.చిన్నయ్య, మెకార్తి మల్లయ్య, మహేందర్ పాల్గొన్నారు.

13 నుండి జిల్లాలో సదరం శిబిరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 13 నుండి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న మూగ, చెవిటి, మానసిక వైకల్యం, 16న కంటిచూపు, 27న ఎముకల సంబంధిత సమస్యలు గల వారికి వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఆయా తేదీలలో శిబిరానికి హాజరయ్యేందుకు ముందుగా సంబంధిత ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రాలలో వికలత్వ పరీక్ష చేయించుకుని మీ - సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరానికి నిర్ణీత తేదీలలో సకాలంలో హాజరు కావాలన్నారు. అర్హత గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



నవతెలంగాణ-రెబ్బెన

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటిలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్పీ ఆదేశాల మేరకు వనమహోత్సవంలో భాగంగా 150 మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని రక్షించడం అందరి బాధ్యతని ఎస్సై అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 10 వరకు పొడిగించడం జరిగిందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని, గ్రామీణ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించి నూతన ఆవిష్కరణలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రతి ఆవిష్కర్త దరఖాస్తు చేసుకోవాలని, అద్భుతమైన ఆలోచనలతో స్థానిక సమస్యలకు ఆవిష్కరణలు తయారుచేసి పరిష్కరించే ప్రతి ఒక్క ఆవిష్కర్తకు అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని ఔత్సాహిక ఆవిష్కర్తలకు సమగ్ర మద్దతు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సంబంధిత ఆవిష్కర్తలకు అవార్డు ప్రధానం చేస్తామన్నారు. ఆవిష్కర్తలు దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 పంపించవచ్చని, దరఖాస్తులు ఆవిష్కర్త పేరు, వయసు, ఫోటో, వృత్తి, చిరునామా, ఆవిష్కరణ పేరు, 100 పదాలతో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణ సంబంధిత హై రిజల్యూషన్ కలిగిన 4 ఫోటోలు, ఆవిష్కరణ విధులను ప్రదర్శించే 2 వీడియోలు ఈనెల 10వ తేదీలోగా పంపించాలని తెలిపారు.

దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్ల పంపిణీ

నవతెలంగాణ-నస్పూర్



దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, అందులో భాగంగా శుక్రవారం జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అర్హత గల దివ్యాంగులకు బ్యాటరీ వీల్‌చైర్లు అందిస్తున్నామని జిల్లా సంక్షేమశాఖ సీనియర్ అసిస్టెంట్ కౌశల్య తెలిపారు. జిల్లాకు చెందిన సూరం పవన్కుమార్, మాదరబోయిన చంద్రశేఖర్, కటకం శంకర్, బోర శేఖర్, కన్నం నారాయణలకు బ్యాటరీ వీల్‌చైర్లు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రవికాంత్, ఎఫ్ఆర్ఓ. ఫర్జానా, డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ సమన్వయకర్త సౌజన్య, విజయ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త శ్యామల, రజిత పాల్గొన్నారు

చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని కొత్తగూడం గ్రామం నుంచి నీల్వాయి వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వర్షాలకు నీరు ఆ గుంతల్లో చేరడంతో దాదాపు 2 కిలో మీటర్లు రోడ్డు మొత్తం చెరువును తలపిస్తుంది. మండల కేంద్రానికి ఇదే ప్రధాన రోడ్డు కావడంతో రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మరడంతో తరుచూ వాహనాలు మరమ్మతులు చేయించాల్సి వస్తుందని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై నీరు నిల్వ ఉండకుండా రహదారి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

పంచాయతీలో డ్రై డే పాటించాలి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని పంచాయతీల్లో ఆరోగ్య కమిటీ సభ్యులతో కలిసి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఎంపీఓ జి.అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ద్వారకాపూర్, కాసిపేట్ గ్రామ పంచాయితీలను సందర్శించారు. ద్వారకాపూర్ కాసిపేట్ గ్రామాల్లో డ్రై డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో పాత్రలలో నీరు నిలవకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిలిచిన ప్రదేశాలలో దోమలు వృద్ధి చేందుతాయన్నారు. వాటి వల్ల మలేరియా, డెంగు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిలిచిన ప్రదేశాలలో గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. గ్రామంలో జరుగుతున్న సానిటేషన్ పనులను పర్యవేక్షించి, మురుగు కాలువలలో పూడిక తీయించాలని, రోడ్లపై ప్లాస్టిక్, చెత్త లేకుండా శుభ్రం చేయించాలని సూచించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి కిరణ్, అంగన్‌వాడీ టీచర్లు శారద, అమృత, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పశువులను గోశాలకు తరలిస్తాం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీలో ఉన్న పశువులను రెండు రోజుల్లో గోశాలకు తరలిస్తామని ఈఓ రాహుల్ శుక్రవారం తెలిపారు. రెండు రోజుల క్రితం రోడ్లపైకి పశువులు వదలకూడదని చాటింపు వేయించినప్పటికి, కొందరు వదులుతున్నారని తెలిపారు. రోడ్లపై వచ్చిన వాటిని దొడ్డిలో వేశామన్నారు. రెండు రోజుల్లో జరిమానా కట్టి వాటిని తీసుకెళ్లకపోతే ఆ పశువులను గోశాలకు తరలిస్తామని తెలిపారు.

సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేషన్ షాపు డీలర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాప్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లు నిర్ణీత గడువులో బియ్యం పంపిణీ చేయాలన్నారు. రేషన్ షాపుల ముందు ధరల పట్టిక, స్టాక్ బోర్డు ఉంచాలని సూచించారు. లబ్దిదారునికి బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని, నగదు బదిలీ చేసినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో బియ్యం నిల్వల్లో తేడా వస్తే ఫుడ్ గ్రీన్ లైసెన్సు రద్దు చేయడంతో పాటు 6ఏ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా పని చేసేట్టు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మురళీధర్ రావు, ఆంజనేయులు, డీలర్లు రమేష్, శంకరయ్య, వసీం పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలిచే పత్రిక నవతెలంగాణ

- మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్

నవతెలంగాణ-జన్నారం



ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరి ప్రలోభాలకు లొంగకుండా సమస్యల పరిష్కారానికి దూర దృష్టితో ఆలోచించి ప్రజలను చైతన్యం చేయడంలో నవతెలంగాణ తెలుగు దిన పత్రిక పాత్ర అమోఘమైందని మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. సామాజిక న్యాయంతో అందరికి అన్ని రకాల హక్కులు అందాలంటూ తనదైన శైలిలో వార్త కథనాలు అందించే పత్రిక నవతెలంగాణ నేడు తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు హార్షిక శుభాకాంక్షలు.

ఇన్‌చార్జి ఎంపీఈఓగా జలందర్

నవతెలంగాణ-జన్నారం



జన్నారం మండల ఇన్‌చార్జి ఎంపీఈఓగా ధర్మారం గ్రేడ్-2 కార్యదర్శి జలందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీఈఓగా ఆయన అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు.

ఐటిఐలో మూడో దశ ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-జన్నారం



పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉన్న వివిధ కోర్సులలో మూడో దశ ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ కోరారు. అందుకు సంబంధించిన ప్రకటనను శుక్రవారం విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్ పద్ధతిలో 12వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అర్హత గల విద్యార్థులు నిజ ధ్రువీకరణ పత్రాలతో ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రోడ్లపైనే పశువులు..ఇబ్బందుల్లో ప్రజలు

- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాలకు కారణమవుతున్న ఆవులు, కుక్కలు



రోడ్డుపై సేద తీరుతున్న పశువులు



రోడ్లపై తిరుగుతున్న వీధి కుక్కలు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారితో పాటు పట్టణ రహదారులపై పశువులు, కుక్కలు ప్రధాన రహదారులపై సంచరిస్తూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కొంత మంది పశువుల యజమానులు ఇలా రోడ్లపై వదిలేయడంతో రోడ్డుపైనే సేద తీరుతున్నాయి. దీని కారణంగా ప్రమాదలు చోటు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉంటే మరో వైపు కుక్కలు రోడ్లపై సంచరిస్తు వాహన దారులతో పాటు పాదచరులకు ఇబ్బందులు పెడుతున్నాయి. ఇటీవల మంచిర్యాల నుండి నిర్మల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యభర్తలకు ముల్కల్ల హైవే రోడ్డుపై కుక్కలు అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. ఇందులో ఇరువురికి గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కుక్కలు, పశువుల వలన జరుగుతున్న ప్రమాదాల దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ , గ్రామా పంచాయితీ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడక పోవడంతో ఇంకా ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందంటున్నారు వాహన దారులు.

పశువుల అడ్డగా జాతీయ రహదారి

మంచిర్యాల నుండి నస్పూర్‌కు వెళ్లే జాతీయ రహదారి పశువులకు అడ్డాగా మారింది. జిల్లా కేంద్రం కావడంతో నిత్యం చెన్నూర్, శ్రీరాంపూర్, ఇందారంతో పాటు దూర ప్రాంతాల నుండి మంచిర్యాలకు వస్తూ వుంటారు. నస్పూర్‌లో కలెక్టర్ కార్యాలయం ఉండడంతో జిల్లా అధికారులతో పాటు ఇతర పనుల నిమిత్తం నిత్యం ప్రజలు ఇదే రోడ్డు గుండా కలెక్టరేట్‌కు వెళ్తుంటారు. అధికారులతో పాటు సామాన్య ప్రజలకు పశువులతో ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో రోడ్డుపైకి రావడంతో వాహనాలు అవి దాటే వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి. అక్కడ భారీగా ట్రాఫిక్ జామవుతుంది. చున్నంబట్టి, సాయి కుంట, 100ఫీట్ల రోడ్డులో ఉండే పశువుల యజమానులు వాటిని పట్టించుకోక పోవడంతోనే అవి ఇలా రోడ్డుపైకి చేరి తిష్ట వేస్తున్నాయని స్థానికులు చెప్తున్నారు. మున్సిపల్, సంబంధిత అధికారులు రోడ్డుపై తిష్ట వేసే పశువులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కేంద్ర మంత్రి క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-మంచిర్యాల

పార్లమెంట్ వేదికగా దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సమాజాన్ని కించపరుస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ బీసీలకు క్షమాపణ చెప్పాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిరసన చేపట్టి కేంద్ర మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంట్ చర్చలలో కేంద్ర ప్రభుత్వం ఇకనైనా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అవహేళన చేస్తూ తమ కులం ఏమిటో తెలియని వారు కూడా కుల గణన కావాలని అడుగుతున్నారని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని అన్నారు. కుల గణన అనేది ఈ దేశపు మెజార్టీ వర్గమైన బీసీల న్యాయమైన డిమాండ్ అన్నారు. కులగణన చేపట్టాలని అడుగుతున్న వారిని కించపరిచినట్లు మాట్లాడడం తగదని, కేంద్ర మంత్రి అగ్రకుల దురహంకారాన్ని బీసీ బిడ్డలు అంగీకరించరని హెచ్చరించారు. మెజార్టీ వర్గాల న్యాయమైన ఆకాంక్షలు తీర్చడం ఎలాగో చర్చించి సలహాలు తీసుకోవాలి తప్ప అడిగిన వారిని నిందించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేసే మంచి పనులు చేయడం చేతకాక చట్టసభల్లో ప్రస్తావిస్తున్న వారిని నిందించడం తగదన్నారు. కులగణన చేపట్టి మెజార్టీ వర్గాల న్యాయమైన ఆకాంక్షలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి నాయకులు మోతె రామదాసు, గాండ్ల తిలకేశ్వర సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, పద్మశాలి సంఘం నాయకులు చలమల్ల అంజయ్య, బీసీ ఐక్య వేదిక నస్పూర్ మండల అధ్యక్షులు సోమన్న, ఓబీసీ జిల్లా అధ్యక్షులు వడ్డే రాజమౌళి, మొగిళి తిరుపతి, డాక్టర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బెంచీలను ఏర్పాటు చేయాలి

- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



నవతెలంగాణ-నస్పూర్

విలేజ్ నస్పూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల తరగతి గదులలో బెంచీలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఈదునూరి అభినవ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి డి.శ్రీకాంత్, ఎఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సన్నీ గౌడ్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా విలేజ్ నస్పూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సుమారు 200పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. తరగతి గదుల్లో బెంచీలు లేకపోవడంతో నెల పైనే కూర్చొని విద్యాబ్యాసం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. పాఠశాలలో టాయిలెట్స్ లేక విద్యార్థినీలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోవడం లేదన్నారు. తాగడానికి నీరు సదుపాయం లేదని, కొన్ని తరగతి గదులకు కిటికీలు లేవన్నారు. పాఠశాల వెనుక వైపు చెరువు ఉండడంతో తేలు, పాములు వస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు భయందోళనకు గురవుతున్నారన్నారు. మధ్యాహ్న భోజన అన్నంలో పురుగులు, రాళ్లు రావడంతో విద్యార్థులు ఇంటి దగ్గర నుండి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ప్రశ్నించిన, సమస్యలు చెప్పిన పిల్లలను ఉపాధ్యాయులు బెదిరిస్తున్నారని, గతంలో కూడా ఉన్నత విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన న్యాయం జరుగలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నస్పూర్ మండల ఉపాధ్యక్షులు అరవింద్ రెడ్డి, నాయకులు తిరుపతి, సాయికుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- తాండూర్ వైద్యాధికారి ఝాన్సీ



నవతెలంగాణ-తాండూర్

సీజనల్ వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నూతనంగా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఝాన్సీ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని ఏడు సబ్ సెంటర్ల ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి తరచు గ్రామపంచాయతీ స్థాయి ఆరోగ్య కమిటీ సమావేశాల్లో పాల్గొనాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల వల్ల వచ్చే రోగాల గురించి తెలియజేస్తూ జాగ్రత్త పాటించేల తీసుకోవాల్సిన చర్యలను తెలియజేయాలన్నారు. సబ్ సెంటర్ పరిధిలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు తాగునీరు పరిసరాల పరిశుభ్రత ఆహార నియమాల గురించి తెలియజేయాలన్నారు. జ్వర పీడుతలను మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చి వైద్య సదుపాయాలను పొందే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. తాండూర్ పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రైయివేటు ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రతి శుక్రవారం గర్భిణులకు పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ శ్రీనివాస్, ఏఎన్ఎంలు నవిత, తులసి, పారిజాతం, పుష్పలత, దేవి పాల్గొన్నారు.

5 నుంచి స్వచ్ఛదానం-పచ్చదనం



నవతెలంగాణ-జన్నారం

ఆగస్టు 5 నుండి ఆగస్టు 9 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రత, పచ్చదనాన్ని ప్రోత్సహించడం, ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి స్వచ్ఛదానం-పచ్చదానం కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని డీఆర్డీడీఓ, మండల ఇన్‌చార్జి అధికారి కిషన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శుభ్రత ప్రతిరోజు వ్యవస్థగా చేపట్టాలని, మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. కార్యక్రమం 5 నుంచి నుంచి 9వ తేదీ వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని తీసుకొని ప్రజలకు పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంఈఓ విజయ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత, ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

తక్కువ ప్రీమియంతో పోస్టాఫీసు బీమా



నవతెలంగాణ-తాండూర్

తక్కువ ప్రీమియంతో పోస్టాఫీసులో బీమా తీసుకోవచ్చని బెల్లంపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ విక్రమ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ద్వారకాపూర్ బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులో డక్ చాపల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టల్ పొదుపు ఖాతాలు, జనరల్ ఇన్సూరెన్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ ప్రమాదభాను తీసుకునేందుకు 18సంవత్సరాల వయస్సు వారు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డుతో స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో ఖాతాను తెరిచి బీమా సౌకర్యాన్ని పొందవచ్చని, రూ.749తో భీమా చేసుకుంటే రూ.25 లక్షలు, రూ.549 ప్రీమియంతో పోస్టాఫీస్‌లో రూ.20 లక్షల బీమా, పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రమాద భీమా కుటుంబానికి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. పొదుపు ఖాతాలకు సంబంధించి ప్రతినెల రూ.100 చొప్పున పొదుపు చేస్తే 5 సంవత్సరాల తర్వాత వడ్డీతో కలిపి రూ. 7137 వస్తాయన్నారు. 10 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతా గూర్చి వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కే.అంజన్న, మాజీ సర్పంచ్ మాసాడి శారద, ఈడీ అబ్దుల్లా, గోపాల్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



నవతెలంగాణ-జన్నారం

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్ సంజీవరాణి అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన పిల్లలకు ముర్రు పాలు తాగించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముర్రుపాలు పుట్టిన పిల్లలకు తాగించాలని సూచించారు.

అంబరాన్ని అంటిన ఎమ్మార్పీఎస్ సంబరాలు



నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యతలు ఇస్తు ఆదేశాలు జారీ చేయడంతో శ్రీరాంపూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం డీజేతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోందని, 2001 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ జరిగిందని, మళ్ళీ 2004లో సుప్రీం కోర్టు వర్గీకరణ రద్దు చేసిందన్నారు. దండోరా ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ కోసం తమ ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరులు 30 సంవత్సరాలుగా కుటుంబాలను పక్కనపెట్టి వర్గీకరణ కోసం పోరాటం చేసిన మాదిగ ఉద్యమకారులకు, సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు, వర్గీకరణ పోరాటానికి బాసటగా నిలిచిన పార్టీలకు సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్. జానాపాటి శరత్ బాబు, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్, జిల్లా నాయకులు జూపాక సాయిలు, మంతెన మల్లేష్, గద్దల బానయ్య, చుంచు శంకర్ వర్మ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు గుంపుల స్వామి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా గోవింద్ సింగ్ సర్దార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా గోవింద్ సింగ్ సర్దార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాదరణ బదిలీల్లో భాగంగా కుశ్నపల్లి రేంజ్ అధికారిగా పనిచేసిన ఆయన ఆసిఫాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా పనిచేసిన అప్పలకొండ నీల్వాయ్ రేంజ్ అధికారిగా బదిలీపై వెళ్లారు.

ప్రతిభ చాటిన లిటిల్ స్టార్ విద్యార్థిని

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇటీవల వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో సోలో పర్ఫామెన్స్ విభాగంలో జిల్లాకు చెందిన విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణంలోని లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న కొంకటి ఇతిక్ష నృత్య పోటీల్లో పాల్గొన్నారు. శాస్త్రీయ పాశ్చాత్య నృత్యాలలో సోలో విభాగంలో ప్రథమ బహుమతి గెలుపొందనట్టు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు మెమోంటోలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమలాకర్ ఇతిక్షకి అందజేసి ప్రశంసించారు.

కుక్కల బెడద నుండి కాపాడండి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణ ప్రజలను వీధి కుక్కల బెడద నుండి కాపాడాలని కోరుతూ పలువురు శుక్రవారం ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. వివిధ వార్డులలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ పలువురిని గాయపరుస్తున్నాయని, గురువారం ఒక్కరోజే 32 మంది వీధి కుక్కల బారిన పడ్డారని వారు పేర్కొన్నారు. వీరికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వాక్సిన్‌లు కూడా అందుబాటులో లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారన్నారు. పట్టణంలో వీధి కుక్కల బెడదను నివారించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందులో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బాల్క శ్యాంకుమార్, నాయకులు శివ, బాబూరావు, సదానందం, మాజిద్, అష్మద్, బబ్లు, ఇబ్రహీం ఉన్నారు.

ఇంట్లో గొడవ చేస్తున్నాడని తండ్రిని చంపిన తనయుడు

నవతెలంగాణ-కడెం

మద్యానికి బానిసై ఇంట్లో గొడవచేస్తున్నాడని తండ్రిని కొడుకు చంపిన ఘటన మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎం.కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన కుడ్మెత మధు(48) మద్యానికి బానిసై తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తరచూ ఇంట్లో గొడవచేసేవాడు. డబ్బులు ఇవ్వనందుకు గొడవపడి ఇంట్లో నుంచి తన భార్య, పెద్ద కొడుకు అనిల్, అతడి భార్య లక్ష్మీలను తరచూ వెళ్లగొట్టేవాడు. వారం రోజుల కింద కొడుకు తండ్రితో గొడవ పడ్డాడు. తండ్రి మళ్లీ తాగేందుకు డబ్బులివ్వాలని గొడవపడి, తన భార్యను, పెద్ద కొడుకు అతని భార్యను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో అనిల్ తన తండ్రిని ఎలాగైనా చంపాలని, లేకుంటే మమ్మల్ని ఇలాగే ఇంట్లో నుంచి మళ్లీ వెళ్లగొడతాడని, తన తండ్రిని చంపితేగాని ఇల్లు దక్కేటట్లు లేదని అనుకొన్నాడు. శుక్రవారం ఉదయం అనిల్ ఇంటికి వెళ్లగా తన తండ్రి మధు అనిల్‌ని మళ్లీ ఇంటికి ఎందుకు వచ్చావని, నీవు ఇంట్లోకి రావాడానికి వీల్లేదని అనిల్‌తో గొడవపడగా, తన తండ్రి ని ఎలాగైనా చంపాలనే ఉద్యేశంతో తన వెంట తెచ్చుకున్న కర్రతో తన తండ్రి తల, ఎడమ కన్ను భాగంలో బలంగా కొట్టాడు. తలకి, ఎడమ కన్నుకి తీవ్ర గాయం అయి ఇంటి ముందు గల సీసీ రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే తీవ్ర రక్త స్రావం జరిగి మధు చనిపోయాడు. మృతుడి తల్లి కుడ్మెత గంగుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలానికి ఖానాపూర్ ఇన్‌చార్జి సీఐ నవీన్ కుమార్ పరిశీలించారు.

సర్పంచుల ఫోరం అధ్యక్షుడి హౌస్ అరెస్ట్

నవతెలంగాణ-జన్నారం

మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్‌ను శుక్రవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ముందు దీక్ష చేపట్టేందుకు సర్పంచ్‌ల సంఘం నిర్ణయించింది. దీంతో పోలీసులు ముందుగానే సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిని అరెస్టు చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. సర్పంచులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తరగతి గదిలో పాము

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని బట్టి సావర్గాం ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో పాము కలకలం రేపింది. శుక్రవారం ఉదయం విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. తరగతి గదిలో పాము కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విద్యార్థులు వెంటనే కేకలు పెట్టి ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వడంతో పరుగున వచ్చిన ప్రధానోపాధ్యాయులు పాములు పట్టే వారిని గ్రామ సేవకులు పనిచేస్తున్న వర్కర్లను పిలిచి పాముని చంపించారు. పల్లె ప్రకృతి వనం నర్సరీ వల్ల పాములు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ ట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనక వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడిగా జాడిరాజన్న, ఉపాధ్యక్షుడిగా దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి, రామిల్ల నరేష్, కార్యదర్శిగా నీలం శేఖర్, కార్యనిర్వహణ అధికారిగా జాడి బానయ్య, సభ్యులుగా చిందం చంద్రయ్య, బి.లక్ష్మణ్, ఎస్.కుమార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షునిగా భుజంగరావు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పెంచికల్‌పేట్ మండల నూతన బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా రౌతు భుజంగరావును జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నియమించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు ఆయనను శాలువతో సన్మానించారు. అధ్యక్షుడిగా నియమకైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, శోభన్, పురుషోత్తం, కాంతారావు, రాజేష్ పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా సునీల్ కుమార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బొమ్మగాని సునీల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి పరిచయం చేసుకున్నారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని సీఐ పేర్కొన్నారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన సత్యనారాయణ ఐజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలియజేయాలి

• కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపు తల్లి ముర్రుపాలు తాగిస్తే చిన్నారుల ఎదుగుదల, రోగ నిరోధక శక్తి పెంపొందుతాయన్నారు. ఈ నెల 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆస్పత్రులు సందర్శించి శిశువు జన్మించిన గంటలోపు తల్లిపాలను పట్టించడం, ప్రాముఖ్యత తెలిసేలా కౌన్సెలింగ్ నిర్వహించాలని, 6 నెలల వయసు నుండి 24 నెలల వయసు పిల్లల ఇండ్లను సందర్శించి బాలింతలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

జనకాపూర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవం

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ హాజరై మాట్లాడారు. నవజాత శిశువులకు తల్లిపాలు అమృత తుల్యమని, గర్భిణులు, బాలింతలు తల్లిపాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం కేంద్రంలోని పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమాలలో జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ పుష్పలత, జిల్లా పోషణ్ అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, జిల్లా మహిళా సాధికారత సమన్వయకర్తలు స్వప్న, శారద, సూపర్‌వైజర్ పెంటు బాయి పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

• జెడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ



నవతెలంగాణ-కెరమెరి

ఆగస్టు 5 నుంచి నిర్వహించే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ నారాయణ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛధనం-పచ్చదనం కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులకు, ఈజీఎస్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 5 నుండి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై మార్గదర్శకాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు వారి కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా కార్యక్రమాలను విజయవంతంగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజాద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఏఓ గోపికాంత్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, ఏపీఎం జగదీశ్వర్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ ఘన స్వాగతం

జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన లక్ష్మీ నారాయణకు శుక్రవారం ఎంపీడీఓ అంజాద్ పాషా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. మండల ప్రత్యేకాధికారిగా నియమితులై ఎంపీడీఓ కార్యాలయానికి మొదటి సారిగా రావడంతో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందించిన వారిలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ప్రసాద్ ఉన్నారు.

కుభీర్ విఠలేశ్వర్ ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని కుభీర్ విఠలేశ్వర్ ఆలయంలో భక్తులు హుండీలో వేసిన కానుకలను శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటాజీ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. రెండు నెలలుగా పోగు చేసిన కానుకలు విఠలేశ్వర్ ఆలయానికి రూ.31,170 నగదు సమకూరినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. అదే విధంగా ఆలయాభివృద్ధికి గ్రామస్తుల సహకారంతో కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు సూది రాజన్న, సాయినాథ్, సతీష్, వాసు, జీవన్, శ్రీకర్, ముత్యం ఉన్నారు.

బూటకపు హామీలతో కాంగ్రెస్ పాలన

నవతెలంగాణ-బెజ్జూర్

బూటకపు హామీలతో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోచి వచ్చిందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షులు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశనికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికలలో పార్టీ ఘన విజయం సాధించి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. అంతేకాదు అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్తారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించే దిశగా సాగాలని, ఈ బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, మాజీ మండల ప్రెసిడెంట్ కొండ్ర మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, వినోద్ కుమార్, డబ్బుల నారాయణ, ఏలూముల రమేష్ పాల్గొన్నారు.

రెండో రోజు 442 మంది వెరిఫికేషన్ పూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీ సెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ రెండో రోజు ప్రశాంతంగా ముగిసిందని ఆదిలాబాద్ డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉమ్మడి జిల్లా అభ్యర్థులు రాగా వారి ధృవపత్రాలను పరిశీలించారు. కాగా శుక్రవారం 550 మంది అభ్యర్థులకు గాను 442 మంది అభ్యర్థులు హాజరై, తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారని 108 మంది హాజరుకాలేదని వివరించారు.

సంత్ జ్ఞానేశ్వర్ మావులి దిండి యాత్ర

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని విఠల్ రుక్మాయి మందిరం నుంచి కుమ్మరి తండా గోవింద్ స్వామి తీర్థ క్షేత్రం వరకు శుక్రవారం భక్తులు పాదయాత్రతో వెళ్లారు. మహిళలు, పురుషులు యాత్రలో పాల్గొని జ్ఞానేశ్వర్ మావులి దర్శనం తీసుకొని మొక్కులు తీర్చుకున్నారు. యాత్రలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఫడ్ విష్ణు, హిందూ వాహిని మండలాధ్యక్షుడు పోష్లె శివాజీ, కేంద్రే సూదాం, కేంద్రే గోవింద్, లాలూ పటేల్, రాజ్‌పాంగే బాలాజీ, వాగ్మారే ఉత్తం, చోలే బాబు, గ్రామ పెద్దలు జాదవ్ సూరజ్, విద్యారాణీ, శివాజీ యూత్ ప్రెసిడెంట్ ఫడ్ రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి

• మిషన్ భగీరథ ఆపరేటర్ల గోడు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఐదు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని, మాకు వేతనాలు ఇప్పించాలని మిషన్ భగీరథ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథలో అపెక్స్ ఇన్‌ఫ్రా లింక్ ఏజెన్సీ ద్వారా సూపర్‌వైజర్లు, పంప్ ఆపరేటర్లు, వాల్, కంప్యూటర్ ఆపరేటర్లు, కూలీలుగా తాము నియమితులయ్యామని, ఐదేండ్లుగా తాము అతి తక్కువ వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిపారు. తమకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఏజెన్సీ వారిని ప్రశ్నిస్తే రేపు మాపంటూ కాలం వెళ్లదీస్తున్నారని వాపోయారు. కనీసం మూడు నెలల వేతనాలైనా తమకు ఇవ్వాలని, అప్పటి వరకు తాము విధులకు హాజరు కాబోమని స్పష్టం చేశారు.

కళాశాలను సందర్శించిన సుబేదార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలను ఎన్సీసీ యూనిట్‌కు కొత్తగా వచ్చిన సుబేదార్ భగీరథ్ రామ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం మాట్లాడుతూ విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వాలని కళాశాలలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సుబేదార్ క్యాడేట్లను ఉద్యేశించి మాట్లాడుతూ తానే స్వయంగా శిక్షణ తరగతులను తీసుకుంటానని, ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన క్యాడెట్ల ఎంపిక ప్రక్రియ చేపడతామని తెలియజేశారు. అలాగే కార్యక్రమంలో ఎన్సీసీ కోఆర్డినేటర్ చంద్రకాంత్‌ను యూనిట్ గురించి, అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన చిన్నయ్య, మొహాల గ్రామానికి చెందిన సాయన్నకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ షఫీ, సాయిప్రసాద్, అర్ష ప్రసాద్, నవీన్ ఉన్నారు.



బదిలీపై వెళ్తున్న సిబ్బందికి వీడ్కోలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న రేంజ్ అధికారి అప్పలకొండతో పాటు అటవీ సెక్షన్ బీట్ అధికారులు సత్యనారాయణ, భగవంతరావు, లక్ష్మణ్, స్వప్న, రవి, మహేష్, రజిత, శ్రీనివాస్‌లకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా అప్పలకొండ ఎంతో గొప్పగా పని చేశారని, సిబ్బందికి ఆయన రోల్ మోడల్ అన్నారు. సాధారణ బదిలీలో భాగంగా సిబ్బంది ఒకేసారి వెళ్లడం కుటుంబ సభ్యులకు దూరం అవుతున్నామనే ఆలోచన కలుగుతుందన్నారు. నూతనంగా వారు వెళ్తున్న ప్రాంతంలో విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారిణి సరోజరాణి, సెక్షన్ అధికారి సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలతో అనుబంధం మరచిపోలేనిది



నవతెలంగాణ-రెబ్బెన

రెబ్బెన జూనియర్ కళాశాలతో తనకున్న అనుబంధం మరచిపోలేనిదని కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి డీఐఈఓ నైతం శంకర్ అన్నారు. మండలంలోని జూనియర్ కళాశాలలో పనిచేస్తూ తనతో పాటు బదిలీపై వెళ్తున్న అధ్యాపకుడు సతీష్, సిబ్బంది శోభా, శశికళలకు కళాశాల సిబ్బంది ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల బాధ్యతలు తీసుకున్నప్పుడు పాఠశాలతో కలిసి కళాశాల ఉండేదన్నారు. భవనం పూర్తి కావడంతో సిబ్బంది సహకారంతో పక్కాభవనానికి మార్చినట్లు తెలిపారు. కళాశాల సిబ్బందితో తన అనుబంధం మర్చిపోలేనిదన్నారు. అంతకు ముందు సిబ్బంది మాట్లాడుతూ ప్రిన్సిపాల్ చేసిన సేవలు, ఆయనతో తమకున్న అనుబందాన్ని గుర్తు చేసుకుంటూ ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. అనంతరం బదిలీపై వెళ్తున్న వారిని సిబ్బంది ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నేరడిగొండ

తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ పిల్లల ఎదుగుదల కోసం మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పిల్లల బరువు, పొడవు, కండరాల సైజు సరిగ్గా కొలతలు తీయాలనీ తప్పుగా తీస్తే పిల్లలకు అందె పౌష్టిక ఆహారం అందకుండా పోతుందని అన్నారు. కొలతల మెషిన్లు ప్రతి సెంటర్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, ఎంపీఓ లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ఎంఈఓ డి.సోమయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్ ఆధ్వర్యంలో పర్యావరణంపై వర్క్ షాప్ నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ డి.సోమయ్య మాట్లాడుతూ పర్యావరణంలో సమతుల్యత లేని కారణంగా ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని వదిలి రసాయాలను వాడటం వల్ల అనేక దుష్ప్రభావాలు వస్తున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ గురించి తెలియజేడానికి ఇలాంటి వర్క్‌షాప్‌లు ఉపయోగపడుతాయన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించాలని, బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దేవేందర్ పటస్కర్, సెక్టోరల్ అధికారి నారాయణ, నేషనల్ గ్రీన్ క్రాప్ ప్లానింగ్ కోఆర్డినేటర్ విద్యాసాగర్, జిల్లా కోఆర్డినేటర్ కంటే నర్సయ్య, పొచ్చారెడ్డి ఉన్నారు.

అత్తను చంపిన అల్లుడు అరెస్టు

నవతెలంగాణ-మంచిర్యాల

అత్తను కత్తితో పొడిచి చంపిన అల్లుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం..జులై 13న చున్నంబట్టికి చెందిన నెల్లి విజయను ఆమె అల్లుడు శాతం వెంకటేష్ కుటుంబ కక్షల కారణంగా తాగిన మైకంలో విచక్షణారహితంగా దాడి చేసి కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం తానూ మెడపై కత్తితో పొడుచుకున్నాడు. చికిత్స అనంతరం డిశ్చార్జి అయి తప్పించుకొని పారిపోవడానికి యత్నించగా మంచిర్యాల బస్టాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు.

ఇండ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ప్రాంతంలో ఇల్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసు అన్నారు. శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో సింగరేణి స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని కార్మికులు, కార్మికేతరులు నివసిస్తున్నారన్నారు. జీవో నెంబర్ 76 ద్వారా ప్రభుత్వం సింగరేణి స్థలాలను రెవెన్యూకు అప్పగించి ఇంటి పట్టాలు అందజేసిందన్నారు. ఇంకా కొన్ని కాలనీలు సింగరేణి ఆధీనంలోనే ఉన్నాయని, వాటిని రెవెన్యూకు అప్పగించి పట్టాలు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సింగాపూర్- శ్రీరాంపూర్ గ్రామ శాఖ కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి మహేష్, కోశాధికారి కూన సాయి కిరణ్ పాల్గొన్నారు.

సైబర్ ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-తాంసి

సైబర్ ఫోన్ కాల్స్‌తో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షీటీం బృందం సభ్యురాలు సుశీల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు షీటీం విధులు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. స్టాక్ పెట్టుబడి మోసం, రైతుల రుణ మాఫీ నకిలీ కాల్స్, డ్రగ్ పార్శిల్, నకిలీ పోలీసు వీడియో కాల్, పార్ట్‌టైమ్ జాబ్, లాటరీ తదితర మోసాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఐటీ కోడ్ డిఎస్పీ హసబుల్లా, షీటీమ్ బృందం సభ్యురాలు సుశీల, సత్యమోహన్ పాల్గొన్నారు.

మోడీ, మందకృష్ణ చిత్ర పటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలో బీజేపీ, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మోడీ, మందక్రిష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల కన్వీనర్ బోరే అరవింద్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుడాల స్వామి మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల ఫలితం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక నిర్ణయం వెలువరించడం హర్షణీయమన్నారు. విజయం సాధించే వరకు మందకృష్ణ వెనకడుగు వేయకుండా పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, అశోక్, శేఖర్, దినేష్, సంతోష్, లలిత, కిష్టయ్య పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో డయల్ 100 కీలకం

- సంఘటన స్థలాలకు వీలైనంత త్వరగా చేరుకోవాలి
- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాంతి భద్రతల పరిరక్షణలో డయల్ 100 సేవలు కీలకమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు తక్షణమే సహాయ సహకారాలు అందించే సదుద్దేశంతో ప్రారంభించబడిన డయల్ 100 సేవల నిర్వహణపై శుక్రవారం పోలీస్ కార్యాలయం నుండి ఏర్పాటు చేసిన వీడియో సమావేశంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల అధికారులు, డీఎస్పీలు, డయల్ 100 విధులను నిర్వర్తించే సిబ్బంది, బ్లూకోల్ట్, పెట్రో కార్ సిబ్బందికి డయల్ 100 ద్వారా చేయవలసిన విధులు, పాటించవలసిన విషయాలపై మార్గదర్శకం చేశారు. ప్రజలలో శాంతిభద్రతలను కాపాడటంలో సమస్యలతో ఉన్న ప్రజలకు అతి త్వరగా పరిష్కారం అందించే దిశగా డయల్ 100 విధులను నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా డయల్ 100 కాల్ వచ్చిన వెంటనే త్వరగా సంఘటన స్థలాలకు చేరుకునేంత వరకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంఘటన స్థలానికి చేరుకున్న తర్వాత బాధితులకు న్యాయం చేకూరే విధంగా విచారణ చేపట్టాలని, సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి స్టేషన్ సిబ్బందిని వినియోగించుకొని ఆ సమస్యను పూర్తి చేయాలని సూచించారు. జిల్లా పోలీసులు అతి తక్కువ సమయంలో సంఘటన స్థలాలకు చేరుకునేలా రికార్డులను కలిగి ఉన్నట్లు తెలియజేశారు. సిబ్బంది విధులను పోలీస్‌స్టేషన్ ముఖ్య అధికారులు ప్రతిరోజు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. డయల్ 100 వినియోగించే టాబ్లెట్లను జాగ్రత్తగా వినియోగించి 24గంటలు నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉండే విధంగా చూసుకుంటూ, అనవసరమైన ఇతర ఏ అప్లికేషన్లను వినియోగించకుండా ఉండాలన్నారు. రాత్రి సమయాలలో, ముఖ్యంగా పట్టణాల ప్రాంతాలలో గస్తీలు నిర్వహిస్తూ ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ మొబైల్, టాబ్లెట్ ద్వారా లేదా సెట్ ద్వారా కమ్యూనికేషన్ సమాచారాన్ని సంబంధిత సిబ్బందికి చేరవేసి ప్రజల వద్దకు చేరుకునే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సిహెచ్ నాగేందర్, పట్టణ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆధార్‌ను, పాన్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

ఆధార్ కార్డును పాన్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని గుర్తింపు సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ-3 గనిపై అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళీ చౌదరితో కలిసి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్‌లో కొంతమంది కార్మికులు ఆధార్ కార్డును పాన్ కార్డుతో అనుసంధానం చేసుకోలేకపోవడం వల్ల ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ జీతంలో రికవరీ చేయడానికి ఆదేశాలు పంపిందని తెలిపారు. కార్మికులందరూ తప్పనిసరిగా ఆధార్ కార్డును పాన్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న 108 జనరల్ మజ్దూర్ ఖాళీలను నింపటానికి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసి దరఖాస్తు చేసుకున్న కార్మికుల సీనియార్టీ లిస్టు, మార్కుల లిస్టు గనులపైకి పంపించడం జరిగిందని, ఆ లిస్టులో ఏమైనా పొరపాట్లు ఉంటే కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

స్వచ్ఛదనం..పచ్చదనం విజయవంతం చేయండి

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామపంచాయతీల పరిధిలో విజయవంతం చేయాలని ఎంపీడీవో గుర్రం సత్యనారాయణగౌడ్ అన్నారు. ఎంపీఓ శ్రీపతి బాబురావుతో కలిసి శుక్రవారం ఐకెపి కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాన్ని ఈనెల 5 నుండి 9 వరకు పంచాయతీల్లో నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు కొనసాగించడం, విరివిరిగా మొక్కలు నాటడం ద్వారా పరిసరాల పరిశుభ్రత పట్ల గ్రామీణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఉదయం మైదానంలో వాకర్లతో కలిసి వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యానికి ఉదయపు నడక చాలా కీలకమన్నారు. ప్రజలంతా ఆరోగ్యకర, నాణ్యమైన జీవన విధానానికి ఉదయపు నడక, వ్యాయామాన్ని భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. మైదానాన్ని ప్రజలు, విద్యార్థులు, యువకులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్లు కొన్ని సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్‌ను వారు కోరారు. అనంతరం స్టేడియంలో గల సదుపాయాలను, వ్యాయామ పరికరాలను ఆయన పరిశీలించారు.

బదిలీపై వెళ్లిన కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ - కాసిపేట

మండల ఇన్‌చార్జి ఎంపీవోగా, పెద్దనపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కొంక నాగరాజును ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో హాజీపూర్‌కు బదిలీపై వెళ్లిన నాగరాజును శాలువాలు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేముల కృష్ణ, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మండల సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ ఉప సర్పంచ్ సోమని మైసక్క, మాజీ వార్డు సభ్యులు కొత్త రమేష్, కంచర్ల పద్మ, పంబాల తిరుపతి, చింతల భీమయ్య, నారిశెట్టి వెంకన్న, జీడుల కనకయ్య, లావుడం నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుని పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు శ్రీరాంపూర్ అంధుల పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు పెట్టం లక్ష్మి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బండి రమేష్, సంయుక్త కార్యదర్శి పొగాకు రమేష్, కార్యదర్శి అన్వేష్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నరేష్, సంతోష్ వెంకట్ రెడ్డి,రవిచంద్ర, సల్మాన్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు విధిగా తాగించాలి

నవతెలంగాణ-జైపూర్

బిడ్డ పుట్టిన మొదటి గంట నుండి ముర్రు పాలు విధిగా తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించడం శ్రేయస్కరమని, ఆ తర్వాత తల్లిపాలతో పాటు అదనపు పాలు తాగించవచ్చని సూచించారు. ఈ విధంగా చేయడం ద్వారా తల్లికి బిడ్డకు మధ్య సత్సంబంధం ఏర్పడటంతో పాటు తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా తల్లిపాలు తాగించిన బిడ్డ ఎదుగుదల లోపం లేకుండా ఉంటుందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లిగా మారినప్పుడు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుర్రం సత్యనారాయణగౌడ్, ఎంఈఓ రాధాకృష్ణ మూర్తి, మండల వైద్యాధికారి ముస్తఫా, శ్రావ్య పాల్గొన్నారు.

